క్లుప్తంగా

జెడ్పీ వైస్ చైర్మన్ పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, తదితరులు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామానికి చెందిన వండాన బాలకృష్ణ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో అదిలాబాద్ రూరల్ మండలం చందా గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు బుధవారం పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి, కొండగూడేం సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు, రామారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్యామలాకుమారి అన్నారు. మండలంలో చాటాయివలస గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలతో పాటు బాలల రక్షణ చట్టాలు, హక్కులను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, అంగన్‌వాడీ కార్యకర్తలు భాను, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథాచారి, తహసీల్దార్ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

రాగిపంట సాగుతో ఆదాయం

రేగిడి: ప్రస్తుతం రాగిపిండికి డిమాండ్ ఉందని, రైతులు రాగి పంటను సాగుచేస్తే లాభాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ మండల అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలో పారంపేట రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రాగిపంట సాగుపై రైతులకు సూచనలు, సలహాలు అందించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుకు ఎంపికచేసుకోవడం ద్వారా మంచి లాభాలు వస్తాయన్నారు. రొటీన్ పంటలు సాగుచేసేకంటే పంట మార్పిడి చేయడం ద్వారా భూమి సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వంగర: ఇటీవల ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న 64 మంది రోగులకు మండల కేంద్రంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకొని అవసరమైన మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సాదం వెంకటరమణ పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 32 మంది ఎంపిక

రేగిడి: మండలంలో కాగితాపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, రాజాం జీఎంఆర్ వీఎఫ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి డాక్టర్ అలేఖ్య 51 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 32 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్యాంపు కోఆర్డినేటర్ సీహెచ్ అశ్విని తెలిపారు. వారందరికీ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. శిబిరంలో స్థానిక సత్యసాయి భజన మండలి కన్వీనర్ తవిటినాయుడు, స్టాఫ్ గీత, సాయి, భజన మండలి సభ్యులు, జీఎంఆర్ వీఎఫ్ ప్రతినిధులు, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సేవలందించారు.

జీవో 117ను రద్దు చేయాలి

వంగర: ప్రభుత్వ పాఠశాలల మనుగడకు గొడ్డలిపెట్టులా ఉన్న జీవో 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పక్కి వాసు డిమాండ్ చేశారు. శివ్వాంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ జీవోతో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తగ్గిపోయిందని, ఇదే కొనసాగితే కొన్నేళ్లకు ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కౌలుకార్డు

రామభద్రపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కౌలు కార్డు ఇవ్వాలని తహసీల్దార్ సులోచరాణి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 590 కౌలు కార్డులు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామాల్లో పర్యటించి కౌలు రైతుల వివరాలు సేకరించడంతో పాటు సదరు భూమి గల యజమాని ఒప్పంద పత్రం తీసుకోవాలని సూచించారు. అలా గుర్తించిన కౌలు రైతుల విరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సూచించారు. కౌలు కార్డు ఉన్న రైతులకు బ్యాంకులు రుణాలతో పాటు ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. భూమి కౌలుకు ఇచ్చిన భూ యజమానులకు ఏ విధమైన ఇబ్బంది ఉండదని చెప్పారు. కార్యక్రమంలో ఏవో వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనరాణి

● **బాడంగి:** భూ యజమానులు తమ భూములను కౌలుకు ఇచ్చినంతమాత్రాన వారికి ఎలాంటి నష్టం జరగదని మండల వ్యవసాయాధికారి కె.శిరీష అన్నారు. మండలంలోని రాజేరు గ్రామంలో బుధవారం రైతులతో సమావేశమయ్యారు. కౌలు గుర్తింపు పత్రాలు(సీసీఆర్‌సీ)పై రైతులు, కౌలుదారులకు అవగాహన కల్పించారు. సీసీఆర్‌సీ పత్రాలకు అర్హులైన కౌలుదారులను గుర్తించారు. ఈ కార్డులు కలిగిన వారికి బ్యాంకుల ద్వారా రుణాలతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. సమావేశంలో ఆర్‌ఐ సీహెచ్ సోమన్న, వీఆర్వో కృష్ణ, వీఏఏ సాయికుమార్ పాల్గొన్నారు.

● **వంగర:** గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు.



బాడంగి: రేజేరు ఆర్‌బీకేలో కౌలురైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శిరీష

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్త సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి కౌలురైతులను గుర్తించనున్నట్లు చెప్పారు. సీసీఆర్‌సీ కార్డులు ఉన్న కౌలురైతులకు పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు ప్రభుత్వమే పంట కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీటీ బూరాడ సుందరరావు, ఎంపీడీవో సాల్మాన్‌రాజ్, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఏఏలు పాల్గొన్నారు.

ఇంకా అందని యూనిఫాం!

- బడులు తెరిచి నెల రోజులవుతున్న సరఫరా కాని యూనిఫాం
- పాత దుస్తులతోనే బడికి వెళ్తున్న విద్యార్థులు
- గత ప్రభుత్వంలో పాఠశాలలు తెరవక ముందే సరఫరా

రామభద్రపురం: పాత యూనిఫాంతోనే విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నారు. పాఠశాలలు తెరిచి దాదాపు నెల రోజులు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు స్కూల్ యూనిఫాం సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు గత ప్రభుత్వం ఇచ్చిన యూనిఫాంతోనే బడికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో 57 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా.. అందులో ఈ ఏడాది 4,244 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ యూనిఫాంల కోసం ఎంఈఓ విద్యాశాఖకు ఇండెంట్ పెట్టారు. అయితే యూనిఫాం ఎప్పుడు సరఫరా చేస్తారో ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన మార్గదర్శకాలు రాకపోవడంతో పిల్లల తల్లిదండ్రులకు ఏమి చెప్పాలో తెలియక పాఠశాలల హెచ్‌ఎంలు తలలు పట్టుకుంటున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే ఇవ్వాల్సిన యూనిఫాం ఇప్పటికీ ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా తమ పిల్లలకు యూనిఫాం దుస్తులు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో తిరుమలప్రసాద్‌ను వివరణ కోరగా యూనిఫాం కోసం నిరీక్షిస్తున్నాం. ఎప్పుడు సరఫరా అవుతుందో ప్రభుత్వం నుంచి అధికారికంగా సమాచారం రాలేదని తెలిపారు.



పాత యూనిఫాంతో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులు

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు 'ఈస్టర్న్ పవర్' యాప్

రాజాం సిటీ: విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు, రాజాం ఏడీఈ ఫణీంద్రకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అలాగే ఈస్టర్న పవర్ వెబ్‌సైట్‌లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా గాని, మొబైల్ యాప్ ద్వారా గాని చెల్లింపులు చేసే వినియోగదారులు పేమెంట్ గేట్‌వేగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, క్రెడ్ తదితర యూపీఐ యాప్‌లతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డులను ఉపయోగించుకునే సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి

బొబ్బిలి రూరల్: ప్రకృతి వైపరీత్యాలను ప్రతీ పౌరుడు ధైర్యంగా ఎదుర్కొవాలని విశాఖకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్‌కుమార్ బెహరా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు ప్రకృతి విపత్తులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, బాధితులను ఎలా రక్షించాలి, క్షతగాత్రులకు అందించాల్సిన ప్రథమ చికిత్స, తదితర అంశాలను వివరించారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేయు విధానాన్ని డెమో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ త్రినాథరావు నాయుడు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఆర్‌ఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

రామభద్రపురం: పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఏవో వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలోని పురుగు మందుల షాపులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్, రికార్డులను పరిశీలించారు. పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయానికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏఏ కంపెనీల మందులు తెస్తున్నారో వాటికి సంబంధించిన ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు ఉండాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిషేధిత మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మొక్కల సంరక్షణతోనే జీవకోటి మనుగడ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే జీవకోటి మనుగడ సాధ్యమని వికాసతరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం 'మొక్కల పెంపకం, వాటి ఆవశ్యకత'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించి ప్రాణవాయువు అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించడం ద్వారా పరిసరాలను పచ్చదనంతో ఆహ్లాదంగా మార్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, వికాసతరంగిణి అధ్యక్షుడు అమనాన నీలకంఠం, ఆశపు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణమూర్తి

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) అన్నారు. స్థానిక హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయిలో నిర్వహించిన స్టూడెంట్స్ కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలను హెచ్‌ఎం ఆయన దృష్టికి తీసుకురాగా, త్వరలో జరిగే మండల సమావేశంలో వాటిపై చర్చించి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, డిప్యూటీ డీఈఓ మోహనరావు, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ రాజారావు, వైస్ ఎంపీపీ భాస్కరరావు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్, ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి, హెచ్‌ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

సంక్షిప్తంగా..

దేశతల్లికి ప్రత్యేక పూజలు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామంలో దేశతల్లి ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిల్లా వసుంధర దంపతులు, గ్రామస్తులు దేశతల్లిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పాడిపంటలతో ప్రతి ఒక్కరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దోమల నివారణకు చర్యలు

రాజాం: పట్టణంలో పలు వార్డుల్లో బుధవారం దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టారు. మురుగుకాలువల్లో యాంటీ లార్వా మందును స్ప్రేయింగ్ చేసినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బొబ్బిలి: కామ్రేడ్ గంటి ప్రసాదం 11వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితి సత్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో విడుదల చేశారు. కార్మిక సంఘాలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమానికి ఆర్థిక చేయూత అందించాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

బొబ్బిలి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులను అణగదొక్కే విధానాలను కొనసాగిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. స్థానిక సామాజిక ఆస్పత్రిలోని ఆయుర్వేద విభాగం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనగా ఈ నెల 10న కోర్కెల దినంగా పాటించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఆరోజున కార్మిక వర్గమంతా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

విత్తన శుద్ధితో చీడపీడల నివారణ

రాజాం: వెదజల్లు పద్ధతిలో వరిసాగు చేసే రైతులు ముందుగా విత్తనాలు శుద్ధి చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ దేవుడుబాబు అన్నారు. మండలంలో సీఎస్‌ఆర్‌పురం, అమరాం, గడిముడిదాం తదితర గ్రామాల్లో రైతులకు విత్తన శుద్ధి, ఆధునిక సాగు పద్ధతులపై బుధవారం అవగాహన కల్పించారు. నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు వర్షాధార ప్రాంతాల్లో రైతులు వెదజల్లు పద్ధతి అనుసరించడం మంచిదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మంత్రి సంతోష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

రాజాం సిటీ: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టంకాల పాపినాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరాకు రాజయ్యపేట సమీపంలో వాటర్ ట్యాంకు వద్ద 1.10 లక్షల లీటర్ల సంపు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ తాగునీరు సరిపడడం లేదని, 3 లక్షల లీటర్ల సామర్థ్యంలో మరో సంపును ఏర్పాటుచేసి పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయాలని కోరారు.

పామాయిల్ తూనిక కేంద్రం ఏర్పాటు చేయాలి

వంగర: పామాయిల్ రైతులు పంటను సులువుగా విక్రయించుకునేందుకు తలగాంలో తూనిక కేంద్రం ఏర్పాటు చేయాలని పామాయిల్ రైతు సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఆలుబిల్లి సుదర్శనరావు కోరారు. వంగరలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తూనిక యంత్రం ఏర్పాటు, రైతు అమ్మకం చేపట్టిన పంట బరువు సమాచారం మొబైల్‌కు అందించాలని, 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలని పామాయిల్ మిల్లు యాజమాన్యాన్ని కోరినట్లు చెప్పారు. అందుకు వారు సానుకూలంగా ఉందన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

రాజాం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుయ్యానవలసలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండలంలో అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరమణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

● **రేగిడి:** మండలంలో మునకలవలస, బాలకవివలస, వన్నలి, సోమరాజుపేట, సంకిలి తదితర గ్రామాల్లో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల పనులను పర్యవేక్షించారు.

ఆయుర్వేద వైద్యంతో మేలు

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని ఖండ్యాం ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. ఖండ్యాం గ్రామంలో బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కీళ్ల నొప్పి, నడుం నొప్పికి ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. తులసి, వేప, తిప్పతీగ, ఉసిరి తదితర సామాగ్రితో ఈ మందులు తయారు చేయడం వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్టులు ఉండవన్నారు. చిన్నారులకు, గర్భిణులకు తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడేలా బోధన

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలని ఎంఈఓ జె.త్రినాథరావు సూచించారు. మండలంలోని పణుకువలస ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం వంటలు, మరుగుదొడ్లు, స్కూల్ పరిసరాలు, హాజరు పట్టీలు, రికార్డులను పరిశీలించారు. లెస్సన్ ప్లానింగ్, డైరీని నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన వంటలు రుచికరంగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు నిర్వాహకులకు సూచించారు. మండలంలో ఆమదాలవలస కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించారు. మెనూ కచ్చితంగా అమలు జరిగేలా చూడాలని హెచ్‌ఎం పాలవలస రమేష్‌కుమార్‌కు సూచించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు.



విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తోటపల్లి పిల్లకాలువలో పూడికతీత

తెర్లాం: మండలంలోని తోటపల్లి ప్రధాన కుడికాలువకు సంబంధించి ఆమిటి నుంచి వంతరాం వరకు ఉన్న పిల్లకాలువలో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. జేసీబీతో పిచ్చిమొక్కలు, పూడికలు తొలగించారు. ఆమిటి నుంచి ఉన్న తోటపల్లి పిల్లకాలువకు గత ఏడాది గండి పడింది. దీన్ని ఇటీవల బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) పరిశీలించారు. వెంటనే గండిని పూడ్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు పిల్లకాలువకు పడిన గండిని పూడ్చేశారు. పిల్లకాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, పూడికలు తొలగించాలని ఆమిటి, కొరటాం, గొలుగువలస గ్రామాల రైతులు ఎమ్మెల్యేను కోరడంతో ఆ పనులు చేపట్టాలని తోటపల్లి ప్రాజెక్ట్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సంబంధిత అధికారులు ఆమిటి, కొరటాం, గొలుగువలస మీదుగా ఉన్న తోటపల్లి పిల్లకాలువ పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే తోటపల్లి పిల్లకాలువ ద్వారా సాగునీరు వస్తుందని రైతులు అంటున్నారు.



ఆమిటి వద్ద తోటపల్లి పిల్లకాలువలో జేసీబీతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

అక్రమ కట్టడాల పరిశీలన

తెర్లాం: తెర్లాంలోని దాసరిబందకు వర్షపు నీరు వచ్చే సాగునీటి కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలను తహసీల్దార్ రాజ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. సాగునీటి కాలువపై కొంతమంది వ్యక్తులు చేపట్టిన అక్రమ కట్టడాలతో చెరువుకు నీరు వచ్చే అవకాశం లేకుండా పోతుందని ఆయకట్టు రైతులు బొబ్బిలి ఆర్డీఓ, ఇరిగేషన్, తహసీల్దార్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఇరిగేషన్ ఏఈ, పీఆర్ ఏఈ, హెచ్‌డీటీ, మండల సర్వేయర్‌తో కలిసి అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. సాగునీటి కాలువపై అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఉప తహసీల్దార్ భాస్కరరావు, మండల ఇరిగేషన్ ఏఈ హరి, పీఆర్ ఏఈ రాజశేఖర్, మండల సర్వేయర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.



సాగునీటి కాలువపై అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

సురక్షిత తాగునీరు సరఫరా చేయాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ఈశ్వరమ్మ, కార్యాలయ పరిపాలనాధికారి అక్కారావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి గ్రామాల్లో సురక్షితమైన మంచి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్యాంకులను శుభ్రం చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించి ఎక్కడైనా పైపులు లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



ఎంపీడీవో ఈశ్వరమ్మతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయండి

రాజాం సిటీ: ఈ నెల 4న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ కోరారు. రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ యూజీ, పీజీ, యూజీసీ నీట్ పేపర్ల లీక్‌కు కారణమైన ఎన్‌టీఏను రద్దు చేయాలని, పేపర్ లీకేజీ బాధ్యులను శిక్షించాలని, తదితర డిమాండ్లతో బంద్ చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే నీట్ ఎగ్జామ్ పూర్తిగా రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని, సుప్రీం కోర్టు తుది తీర్పు రాకముందే ఈ నెల 6 నుంచి జరగనున్న కౌన్సిలింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి పాత పద్ధతిలోనే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

బీజేపీ అండతోనే సహారా కంపెనీ మోసం

బొబ్బిలి: బీజేపీ దుర్మార్గపు ఆలోచనతోనే ఏజెంట్లు, డిపాజిటర్లను సహారా కంపెనీ పదేపదే మోసం చేస్తోందని సహారా బాధితుల పోరాట కమిటీ నాయకుడు పొట్నూరు శంకరరావు, సీనియర్ ఏజెంట్లు బి.లక్ష్మీదాసు, వైఏ నాయుడు, ఏటీ నాయుడు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..సహారా బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు హామీ ఇచ్చారని, గెలిచాక మోహం చాటేస్తున్నారని వాపోయారు. మోదీ సహకారంతో అమిత్‌షా కుమారుడు కోట్ల రూపాయల విలువైన యాంబీ వాలీపై కన్నేశారన్నారు. తాము బిజినెస్ చేయడం లేదని 2022లో ప్రకటించి మళ్లీ వేరే కంపెనీ ద్వారా వ్యాపారం చేయడం మోసమన్నారు. కనీసం మరణించిన డిపాజిటర్ల కుటుంబాలకు అయినా బేషరతుగా డబ్బులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలోని మహారాణిపేటలో ఉన్న గంటి ప్రసాదం స్మారక భవనంలో ఈనెల 5న నిర్వహించే అవగాహన సదస్సులో బొబ్బిలి కేంద్రంగా ఉన్న ఏడు మండలాల సహారా ఖాతాదారులు, ఏజెంట్లు తరలిరావాలని కోరారు.